మురళి పాలిపోయిన మొఖంతో రాధవేపు చూశాడు.

రాధ పరుగుతో మురళి దగ్గరకు నడిచింది.

“నాన్నా ఒకవేళ అతను- వారేనేమో-- నాకు భయంగా ఉంది! అప్పుడే అతన్నేమీ చేయకండి!” అంది కలవరపాటుతో.

“నీకు అనుమానం అఖ్ఖర్లేదమ్మా, వీడు మన మురళి మాత్రం కాదు -- నాకు తెలుసు కదా!”

“ఎలా తెలుసు మీకు?”

“మురళి ఇంతకుముందే కదా మద్రాస్ వెళ్ళాడు?”

“ఆ మాట నిజమే కానీ...... నాకంతా అయోమయంగా ఉంది. పోనీ ఆయన వచ్చేవరకూ ఇతనిని బంధించి ఉంచితే...”

“రాధా!” కోపంగా అరిచాడు మురళి.

రాధ భయంగా అతనివేపు చూసింది. “ఏమిటి?” అంది బెరుగ్గా.

“వాడెవడినో పట్టుకుని ‘ఆయన’ అంటున్నావా, నేనేమో ‘అతను’ అయిపోయానా? నేను అసలు భర్తనో, నకిలీ మొగుడినో ఆ మాత్రం తెలీటంలేదా!”

రాధ బెంబేలెత్తిపోయింది “అయ్యో! అచ్చం ఆయన గొంతులానే ఉంది నాన్నా!” అంటూ దీనంగా నరసింహంవేపు చూసిందామె.

రంగా ఇంక ఆలస్యం చేయదల్చుకోలేదు.

మురళి పొట్టమీద ఒక్క తన్ను తన్నాడు బలంగా. మురళి ఎగిరి కింద పడ్డాడు.

“పదరా--కొడకా-- బయటకు పద! కార్లో కూర్చో--” కత్తి పట్టుకుని అతని దగ్గరకు నడిచాడు మళ్ళీ.

మురళి పొట్ట చేత్తో పట్టుకుని బాధతో విలవిలలాడిపోసాగాడు.

“మావయ్యా! ఆ హరికృష్ణగాడు ఆడిన నాటకం తెలుసుకోలేక నన్నే చంపేయాలని చూస్తున్నావ్, నేను నిజంగా మురళినే.”

నరసింహాన్ని ఓ క్షణం పాటు అనుమానం ఊగించివేసింది.

‘వీడు నిజంగా అల్లుడు కాదుగదా-- ఒకవేళ వీడు నిజంగా మురళి అయినట్లయితే ఇందాక మద్రాస్ వెళ్లింది ఎవరూ! వాడు హరికృష్ణా! నో? అసాధ్యం! వాడు ఏ పరిస్థితిలోనూ హరికృష్ణ అయే అవకాశం లేదు. అన్ని రకాల పరీక్ష ల్లోనూ వాడే తన మురళి అని తెలిసిపోయింది. మరి వీడూ తను మురళినంటాడేమిటి?

అతని బట్టలు, బూట్లు, పెన్ను అన్నీ పరీక్షగా చూశాడు నరసింహం. అన్నీ ఖచ్చితంగా అతను మురళియేనని చెప్తున్నాయ్. మెడలో తను వేసిన పులిగోరు కూడా ఉండనే ఉంది.

హఠాత్తుగా గుర్తుకొచ్చింది నరసింహానికి , అవును! ఆ పులిగోరు లోపల తను సంతకం చేసిన చిన్న కాగితం ఉంది. అది తీసి చూస్తే తెలిసిపోతుంది. ఆ దండు కాగితం అంత తేలికగా

లభించేది కాదు. అలాగే తన సంతకం ఫోర్జరీ చేయటం కూడా అంత తేలికేం కాదు.

ఓ సారి అది చూస్తే?

“రంగా” పిలిచాడు నరసింహం.

“ఏం సార్!”

“వాడి మెడలోని పులిగోరు తీసుకు రా”

రంగా పులిగోరు ఒక్కసారిగా గుంజి తీసుకొచ్చి నరసింహానికిచ్చాడు.

నరసింహం వెంటనే దాన్ని తన గోటితో తెరిచి లోపల ఇరుక్కుపోయిన కాగితం ముక్కను జాగ్రత్తగా బయటకు లాగాడు. ఆ కాగితం మడతలు విప్పేసరికి తన సంతకం స్పష్టంగా కనిపించింది.

ఏ మాత్రం సందేహం లేదందులో! అది తన సంతకమే! అంటే--- అంటే.... వీడే తన మురళి! మరి ఇందాక వచ్చి నానా హడావుడి చేసి మద్రాస్ వెళ్ళింది హరికృష్ణా?

నరసింహం ముఖం పాలిపోయింది.

“ఇప్పుడయినా నమ్మకం కుదిరిందా! నేను చెప్తుంటే ఎవ్వరూ వినిపించుకోరు....” అన్నాడు మురళి.

“మురళి! వాడు-- ఆ హరికృష్ణగాడు -- ఇంతకుముందే వచ్చి పెద్ద నాటకమాడాడురా, అన్నీ తెలిసి కూడా నేను బోల్తా పడ్డాను--”

“ఏం జరిగింది.”

“ఆ ఎస్.టి.సి వాళ్లకోసం అయిదు రూపాయిల స్టాంప్ పేపర్ ఖాళీ దానిమీద సంతకం పెట్టాను. అల్లుడనుకొని వాడికిచ్చేశాను! కొంప మునిగింది”

రాధ మొఖంలో కళ తప్పింది.

“అంటే?.... ఇందాక వచ్చింది వారు కాదంటారా నాన్నా?” కంపిస్తున్న స్వరంతో అడిగింది రాధ షాక్‌లో ఉన్నదాన్లా.

మురళి ఆమె దగ్గరకు నడిచి అనురాగంతో ఆమెవేపు చూశాడు “రాధా! అయిందేదో అయింది. మనం ఇంక ఇక్కడ వుండటం మంచిది కాదు. కొంతకాలం విదేశాల్లో ఎక్కడికయినా వెళ్ళి ఉందాం! ఆ హరికృష్ణగాడితో మనం సరితూగలేం!”

నరసింహం ఉలిక్కిపడ్డాడు “ఆ దుర్మార్గుడికి బుద్ది చెప్పాలిగానీ -- విదేశాలకు పారిపోయి లాక్కుంటావా?” పౌరుషంగా మురళినడిగాడు.

“అవును ! ఇంక నేను వాడితో విసిగిపోయాను. వాడితో చెలగాటమాడితే నా ప్రాణానికే ముప్పు వచ్చేట్లుంది”

“వాడేం చేస్తాడు నిన్ను? నీ దగ్గర పిస్టల్ వుంటుంది కదా ఎప్పుడూ?”

“వాడు డైరక్టుగా నామీదకు రాడు నీతోనే-- నన్ను చంపించి వేస్తాడు....”

“ఏమ్మాన్! నేనంత తెలివి తక్కువ వెధవననుకున్నావా?”

"ఇంతకుముందు నువ్ చేయబోయిందేమిటి? పులిగోరు లోపల కాగితం తీసి చూడమన్నాకూడా వినకుండా-- నన్ను చంపిపారేయమని రంగాతో చెప్పావ్! ఇంకాసేపు ఆలస్యమయితే నేనీపాటికి పరలోకం చేరుకుని ఉండేవాడిని కదా!"

"ఇంకోసారిలాంటి పొరపాటు జరగదు-- మరీ ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ప్రవర్తించానీసారి.!"

"వద్దు! నాకీ ఆస్తీ వద్దూ! ఈ ఊరూ వద్దు! నేనూ రాధా వెళ్ళిపోతున్నాం!...."

అంతవరకూ దుఃఖం బిగపట్టుకుని నిలబడ్డ రాధ హఠాత్తుగా రెండు చేతుల్లో మొఖం దాచుకుని బిగ్గరగా విలపించసాగింది.

మురళి దిగ్భ్రాంతి చెందాడు "చూశావా మావయ్యా! మధ్యలో రాధ ఎంతగా నలిగిపోతుందో? ఎప్పటికప్పుడు తన దగ్గరున్నది నేనో, వాడో తెలీక -- తెలుసుకునే దారిలేక తల్లడిల్లిపోతోంది. నేను తన భుజం మీద చేయివేస్తే చాలు తృళ్ళిపడుతోంది. నేను ముద్దు పెట్టుకోబోతే చాలు మీరు మీరేనని గుర్తేమిటి -- ఏదయినా ఋజువు చూపించమంటోంది. ప్రతీసారీ నేను తలమీద దెబ్బ, వీపుమీద దెబ్బ, పుట్టుమచ్చ, కర్చీఫ్ మీద తను స్వయంగా కుట్టిన 'లవ్' అనే అక్షరాలు -- ఇలా ఎన్నో ఋజువులుగా చూపిస్తే గానీ సంసారసుఖం అనుభవించే రాత లేకుండా పోయింది. నీకు నేనెప్పుడూ చెప్పలేదు! మేమిద్దరం సంసార సుఖం అనుభవించి నెలరోజులు దాటిపోయింది! ఆ హరికృష్ణగాడు నేను లేనప్పుడు వచ్చి రాధతో సరసాలవరకే సరిపెట్టుకుంటున్నాడు గనుక బతికి బయటపడుతున్నాం! వాడికి మతి చలించి, మోజు పెరిగితే -- రాధ శీలం అపహరించినా మనం ఏం చేయగలం? అందుకే ఇంక ఇక్కడ వుండదల్చుకోలేదు. ఈ దేశం వదిలి ఎక్కడో చోట సుఖంగా బ్రతుకుతాం!"

ఆ మాటలతో నరసింహం మొఖం మాడిపోయింది.

అంతకుముందు హరికృష్ణ రాధతో పాటు పడగ్గదిలో జరిపిన శృంగారం కళ్ళముందు మెదిలింది. సోఫాలో కూలబడిపోయాడు.

మురళి మాటలకి రాధ కదిలిపోయింది.

అతి కష్టంమ్మీద దుఃఖం ఆపుకుని మురళివేపు దీనంగా చూసింది.

"ఏమండీ! ఘోరంకూడా జరిగిపోయిందండీ! ఇందాక వాడు..... ఆ దుర్మార్గుడు వచ్చినప్పుడు మీరేననుకుని ..." ఇంక చెప్పలేక పైకే ఏడ్చేయ సాగిందామె.

మురళి నిశ్చేష్టుడయ్యాడు.

కొద్దిక్షణాలు రాధ వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం ఒక్కటే వినిపించింది. క్రమంగా మురళి మొఖంలో క్రౌర్యం చోటు చేసుకోసాగింది. మొఖం ఎరుపెక్కసాగింది. కళ్ళు రక్తపు గూళ్లల్లా కనబడుతున్నాయ్. పిడికిళ్ళు ఇనుపముద్దల్లా బిగుసుకున్నాయ్.

"ఇంతకాలం వాడేం చేసినా సహించాను. ఇంతకాలం వాడు చేసినవన్నీ ఒకెత్తూ, ఇప్పుడు నాకు ద్రోహం చేయడం మరో ఎత్తు. ఈ తప్పుకి వాడి ప్రాణాలు తీసుకొంటాను! అదీ ఎప్పుడో కాదు! రెండు రోజుల్లోపలే!" అన్నాడు ఉద్రేకంతో

నరసింహంలో పోయిన ప్రాణం తిరిగి వచ్చింది. నెమ్మదిగా మురళీకి సమీపంగా వచ్చి అతని భుజంమీద చేయివేశాడు.

“శభాష్! నేనూ అదే ప్రయత్నంలో వున్నాను. వాడికి కాలం చెల్లింది! అందుకే ఇంత ద్రోహానికి పూనుకున్నాడు”

మురళి రాధను దగ్గరకు తీసుకున్నాడు.

“రాధా! జరిగింది మర్చిపో! రేపటిలోగా వాడి శవం నీకు చూపిస్తాను! సరేనా?”

రాధ మాట్లాడలేదు. దిగాలుపడిన రూపంతో కన్నీరు తుడుచుకుంటూ లోపలకు నడిచింది.

“ఓకే మురళీ! వాడినేకాదు! ఆ దుర్మార్గుడితో చేతులు కలిపిన మీ అమ్మనూ క్షమించకూడదు!” అన్నాడు నరసింహం.

“నేనేం చేస్తానో నువ్వే చూస్తావ్ కదా!” అన్నాడు మురళి కోపం అణుచుకుంటూ.

14

రాత్రి పది గంటలయింది.

కృష్ణ కోసం ఎదురు చూస్తూ గడపలోనే కూర్చుంది శారదమ్మ. సమయం గడుస్తున్నకొద్దీ ఆమెకు ఆదుర్దా పెరిగిపోతోంది.

ఉదయమనగా ఇంట్లోనించి వెళ్లాడతను. తిరిగిరావటం ఆలస్యమయిన కొద్దీ మనసంతా ఆందోళనతోనూ, భయంతోనూ నిండిపోతోంది తనకు. నరసింహంమీద పగబట్టి అతనిని ముప్పుతిప్పలు పెడుతున్నాడుగానీ వాడితో పేచీకి దిగటం పాముతో చెలగాటమాడినట్లేనని తనకు తెలుసు!

ఆ రోజు తన భర్తను ఎంత దారుణంగా చంపాడో తల్చుకుంటేనే శరీరం గగుర్పొడుస్తోంది. ఇంకా కళ్లముందు జరుగుతున్నట్లే ఉంటుంది. ఆ నేరం తనమీద వేసుకోకపోయినట్లయితే -- తన ఇద్దరు కొడుకులనూ కూడా అలాగే అంతంచేసి వుండేవాడు.

టైమ్ పదకొండవుతోంది.

చుట్టుపక్కల అందరిళ్లలోనూ లైట్లారిపోయినయ్. ఇంటికెదురుగ్గా వున్న రోడ్డు నిర్మానుష్యంగా తయారయింది. తలుపులు మూసి మంచంమీద పడుకుందామె. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టటంలేదు.

ఒకోసారి అర్ధరాత్రి వచ్చి తెల్లారుజామునే వెళ్ళిపోతుంటాడు మళ్ళీ.

తలుపు తట్టినట్లనిపించింది శారదమ్మకు. చటుక్కున లేచి వడివడిగా వెళ్ళి తలుపు తెరిచింది. బయట ఎవరూ కనిపించలేదు.

తన భ్రాంతి! అంతే! మళ్ళీ వెళ్లి మంచంమీద పడుకుందామె. రాన్రాను తను గడుపుతున్న జీవితం అశాంతి కలిగిస్తోంది. నరసింహం కంటపడకుండా రహస్యంగా -- గడపటం --

సుఖమూ లేదు.

ఇలాంటి దారుణమయిన బ్రతుకు బ్రతకటం కంటే -- ఎక్కడికో దూరంలోని ఏ మారుమూల గ్రామానికి వెళ్ళి బ్రతకటం కంటే-- ఎక్కడికో దూరంలోని ఏ మారుమూల గ్రామానికి వెళ్లి బ్రతకటం మంచిది కదూ?

తన కుటుంబం ఆ నాడే నరసింహం చేతిలో సర్వనాశనమయింది. ఇప్పుడు కృష్ణను కూడా అంతం చేస్తాడు. ఆ తరువాత తనను చంపేస్తాడు.

ఆమె మంచంమీదనుంచి మళ్ళీ లేచి కూర్చుంది.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

వీల్లేదు! ఇంకొక్క క్షణంకూడా తామిక్కడ వుండకూడదు. ఇవాళ కృష్ణతో చెప్పేయాలి! ఇద్దరూ ఈ నగరం వదలి-- దూరంగా ఎవరికీ తెలీని చోటుకెళ్ళి ప్రశాంతంగా జీవితం గడపాలి! నరసింహం చేసిన పాపానికి భగవంతుడే తగిన శిక్ష విధిస్తాడు. తనకా నమ్మకం వుంది.

ఆ నిర్ణయం తీసుకున్నాక ప్రశాంతంగా నిద్ర పట్టిందామెకి.